# అధికారం కోసమే కాంగ్రెస్ పాకులాట



పెద్దలింగాపూర్‌లో గజమాలతో బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు ఘన స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు, గ్రామస్తులు

- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- 'హస్తం' పార్టీవన్నీ అబద్ధపు హామీలే..: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి
- పెద్దలింగాపూర్‌లో ఎన్నికల ప్రచారం

ఇల్లంతకుంట, నవంబర్ 5: ఎన్నికల్లో కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఇస్తూ.. అధికారం కోసం పాకులాడుతున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన పెద్దలింగాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కర్ణాటక గతే వస్తుందన్నారు. వ్యవసాయానికి కేవలం ఐదు గంటల కరెంటే ఇస్తున్నామంటూ.. ఆ రాష్ట్ర మంత్రులే చెబుతున్నారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటలు కరెంటు, రైతుబంధు, రుణమాఫీ, పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని స్పష్టం చేశారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీవన్నీ అబద్ధపు హామీలేనని, వారిని నమ్మితే గోసపడుతామని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దరువు ఎల్లన్న, గడ్డం నాగరాజు, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్ గౌడ్, సర్పంచులు సిద్ధం శ్రీనివాస్, గొడిసెల జితేందర్‌గౌడ్, పొన్నం తిరుపతి, కంకటి మధునవ్వ, నాయకులు పాల్గొన్నారు.



పెద్దలింగాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

# ఊరూరా.. ఉత్సాహంగా

- మానకొండూర్ నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం
- అభివృద్ధిని చూసి కారుగుర్తుకు ఓటేయాలని పార్టీ శ్రేణుల విజ్ఞప్తి



గన్నేరువరంలో మహిళ కు కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మానకొండూర్, నవంబర్ 5: మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. ఇందులో భాగంగా ఆదివారం ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై అవగాహన కల్పిస్తూ మానకొండూర్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుర్రం కిరణ్ గౌడ్, మండల ఇన్‌చార్జి దండబోయిన శేఖర్‌ముదిరాజ్, నాయకులు గడ్డి గణేశ్, రహమత్‌అలీ, పిండి సందీప్, గౌస్, గొల్ల శ్రీనివాస్, పురం అనిల్, ఇస్కుల్ల ఆంజనేయులు, రాయికంటి కిరణ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్‌లో..**

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 5 : మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ తరఫున నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరించి, కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

**శంకరపట్నంలో..**

శంకరపట్నం, నవంబర్ 5: ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్ గెలుపు ఖాయం అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చింతలపల్లి, మొలంగూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఆయనను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. 'కారు' గుర్తుకు ఓటు వేసి రసమయిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పల్లె సంజీవరెడ్డి, ఎంపీటీసీ మొయిన్, ఉప సర్పంచ్ వెంకన్న, మొలంగూర్ గ్రామాధ్యక్షుడు మేడుదుల ఐలయ్య, ఆర్‌బీఎస్ నాయకులు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, నరహరి బుచ్చిరెడ్డి, సుభాష్‌రెడ్డి, మరాటి వెంకటేశ్వర్లు, పల్లె సదాశివరెడ్డి, నాంపెల్లి శంకరయ్య, ఖలీల్, రఘుపతి పాల్గొన్నారు.

**గన్నేరువరంలో..**

గన్నేరువరం, నవంబర్ 5: మండలకేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తరఫున పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఓటర్ల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి, మ్యానిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరించారు. అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్‌ను మూడోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు న్యాత సుధాకర్, ప్రభాకర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్: మండల కేంద్రంలో కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకే ఓటు వేయాలని కోరుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



శంకరపట్నం: లింగాపూర్‌లో రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మానకొండూర్: ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

# అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 5: ప్రభుత్వం మానకొండూర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై అనేక మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పేర్కొన్నారు. మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు, లల్లీ యూత్ క్లబ్ సభ్యులు ఆదివారం తిమ్మాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరగా, జీవీఆర్ గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని, పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు దేవేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ఎలుక ఆంజనేయులు, జగదీశ్, కిరణ్, సదయ్య, వేణుకుమార్ పాల్గొన్నారు.

**మానకొండూర్‌లో..**

మానకొండూర్, నవంబర్ 5: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై వివిధ పార్టీలు, అసోసియేషన్లకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు సమక్షంలో మానకొండూర్ మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ అన్నారం గ్రామ మాజీ అధ్యక్షుడు మేడి శ్రీనివాస్, ఆర్ఎంపీ జిల్లా అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఆరుకాల సంజీవరెడ్డి, అసోసియేషన్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి కొంపెల్లి రవి బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి జీవీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే వివిధ పార్టీలకు చెందిన 30 మంది యువకులు జీవీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఉపసర్పంచ్ నెల్లి మురళి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు పిట్టల మధు, నాయకులు శాతరాజు యాదగిరి, ఉండింటి శ్యాంసన్, బోడ రాజశేఖర్, నెల్లి శంకర్, దండు రాములు పాల్గొన్నారు.



తిమ్మాపూర్ రూరల్ : బీఆర్ఎస్‌లో చేరిన యువజన సభ్యులతో జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు

## పోలీసుల వాహన తనిఖీలు

శంకరపట్నం, నవంబర్ 5: కేశవపట్నం శివారులో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వచ్చీ పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అనుమానం వచ్చిన కార్లు, తదితర వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులను ఆపి ప్రయాణికులను కిందకు దింపి సోదాలు చేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏమైనా డబ్బు, అక్రమ మద్యం, తదితరాలను రవాణా చేస్తున్నారా ?.. అనే కోణంలో తనిఖీలు చేపట్టారు. కాగా, తనిఖీల్లో ఏమీ పట్టుబడలేదని ఎస్ఐ వెల్లడించారు. ఇక్కడ ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## మద్యం పట్టివేత

తిమ్మాపూర్, నవంబర్ 5: ఎన్నికల నేపథ్యంలో పరిమితికి మించి మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని నల్గొండ శివారులో ఆదివారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా, మార్క రాములు అనే వ్యక్తి పరిమితికి మించి 24 మద్యం బాటిల్లు తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి.. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ, నాటుసార, గంజాయి, మద్యం అక్రమ నిల్వ, రవాణా నిల్వ చేస్తే.. 8712658810 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. తనిఖీల్లో సిబ్బంది కొండల్ రెడ్డి, సురేశ్, రజిత తదితరులు ఉన్నారు.

## యువకుడి ఆత్మహత్య

మానకొండూర్, నవంబర్ 5: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలోని దేవంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవంపల్లి గ్రామానికి చెందిన కోట సంతోష్ కరీంనగర్‌లో బైక్‌మెకానిక్ పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో తాగుడుకు బానిసయ్యాడు. సంతోష్ కుటుంబ సభ్యులు శనివారం దైవదర్శనానికి కొండగట్టు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కోట లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.